












# టెన్షన్ పెంచుతున్న నాల్గో తేదీ



- జోరందుకున్న బెట్టింగ్‌లు
- గోపాలపురం కేంద్రంగా పందేలు
- ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

**దేవరపల్లి:** జూన్ నాల్గో తేదీ పేరెత్తితే చాలు ప్రజల్లో టెన్షన్ అంతకంతకూ పెరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడే తేదీ దగ్గర పడుతుండడంతో బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. నాల్గో తారీఖు ఎప్పుడు వస్తోందని బెట్టింగ్ రాయుళ్లు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. రోజు రూ. కోట్లలో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఇతర జిల్లాలతో పాటు తెలంగాణకు చెందిన పలువురు ఇక్కడకు వచ్చి బెట్టింగ్‌లు కాయడం విశేషం. వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకుల మధ్య బెట్టింగ్‌లు జోరుగా జరుగుతున్నాయి. ప్రభుత్వం వస్తోందని కొంతమంది, గోపాలపురం నియోజకర్గంలో ఎమ్మెల్యే గెలులుపై మరికొంత మంది బెట్టింగ్ వేస్తున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడితే రూపాయికి రెండు రూపాయలు, టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడితే రూపాయికి రూపాయి ఇచ్చేలా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. గోపాలపురంలోని మార్కెట్ యార్డు కేంద్రంగా రాత్రి సమయంలో బెట్టింగ్‌ను నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఎక్కడెక్కడి నుంచో బెట్టింగ్ నిర్వాహకులు రాత్రి సమయంలో అక్కడకు చేరుకుని బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు సమాచారం. రాత్రి సమయంలో కార్లు, బైక్‌లతో యార్డు సందడిగా ఉంటోందని ఆ ప్రాంత ప్రజలు తెలిపారు. గోపాలపురం నియోజకవర్గంపై ఎక్కువగా బెట్టింగ్ వేస్తున్నారు. నగదుతో పాటు ఇళ్లు, పొలాలు, ఇళ్లస్థలాలు, బైక్‌లు, కార్లు బెట్టింగ్ వేస్తున్నట్టు సమాచారం. రూ.10 లక్షల నుంచి కోటి వరకు బెట్టింగ్ జరుగుతున్నట్టు తెలిస్తోంది. బెట్టింగ్ నిర్వాహకులతో పాటు సామాన్యులు కూడా నాల్గో తేదీ కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. పందెంలో ఎవరు గెలుస్తారో చూడాలంటే మరొక మూడు రోజులు ఆగవల్సిందే మరి.







# తడి, పొడి విధానంతో అధిక దిగుబడులు

- నీటి వనరుల ఆదా
- నర్సరీ ఫార్మ్ సంస్థ ఏరియా మేనేజర్ శ్రీకాంత్
- నల్లజర్లలో రైతులకు అవగాహన

**నల్లజర్ల:** వరి సాగులో తడి, పొడి విధానాన్ని అవలంబిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని నర్సరీ ఫార్మ్ సంస్థ ఏరియా మేనేజర్ ఎస్. శ్రీకాంత్ రైతులకు సూచించారు. ఆ సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో రైతులకు శనివారం నల్లజర్లలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ విధానాన్ని అవలభిస్తే అధిక దిగుబడుల సాధనతో పాటు భవిష్యత్తు తరాలకు సాగు నీటిని అందించేవారం అవుతామన్నారు.





తడి,పొడి సాగు విధానంపై రైతులకు వివరిస్తున్న నర్సరీ ఫార్మ్ మేనేజరు శ్రీకాంత్

రైతులు వరిని పండించడానికి ప్రస్తుతం 70, 80 శాతం నీటిని వినియోగిస్తున్నారని ఆయనన్నారు. వ్యవసాయ యాంత్రీకరణపై మొగ్గుచూపుతున్న మాదిరిగానే రైతులు నీటి యాజమాన్యంలో కూడా మార్పు రావాలన్నారు. ఈ ఏడాది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 7 వేల హెక్టార్లలో తడి, పొడి విధానం అమలు చేయనున్నట్టు చెప్పారు. భీమడోలు, నల్లజర్ల, లింగపాలెం, చింతలపూడి, ముసునూరు మండలాలను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో నల్లజర్ల రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


**రాజమహేంద్రవరం రూరల్:** మోటార్ బైక్‌పై వెళుతున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన మరో మోటార్ సైక్లిస్టు ఢీకొన్నాడు. నగరంలని బాలాజీపేట రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం కొవ్వూరుకు చెందిన గోరుగంతుల అశోక్ (35), భార్యతో కలిసి బొమ్మూరులో నివసిస్తున్నాడు. అతడు కొవ్వూరులోని అవంతి ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. రోజూ బొమ్మూరు నుంచి బైక్‌పై డ్యూటీకి వెళ్లి వస్తుంటాడు. శుక్రవారం రాత్రి కొవ్వూరు నుంచి బొమ్మూరు వస్తుండగా బాలాజీపేట రోడ్డులో ఎదురుగా, అజాగ్రత్తగా, వేగంగా వచ్చిన మరో వ్యక్తి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అశోక్‌కు తలకు తీవ్రమైన గాయం కావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అశోక్ తండ్రి శివనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

















## క్లుప్తంగా

### క్రీడా సామగ్రి బహూకరణ



క్రీడా సామగ్రి అందజేస్తున్న పార్డ్ ఇండియా సంస్థ అధ్యక్షుడు షరీఫ్

**నల్లజర్ల:** మండలంలోని దూబచర్లలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలోని విద్యార్థులకు శనివారం పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ నల్లజర్ల శాఖ అధ్యక్షుడు ఎండీ షరీఫ్ క్యారమ్ బోర్డులు, చెస్ బోర్డులు, ఇతర క్రీడాసామగ్రి అందజేశారు. శాప్ ఆధ్వర్యంలో గత నెలలో ఇక్కడ ప్రారంభించిన యోగా, చెస్ శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు మరో వారం రోజుల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని శిబిరం నిర్వాహకుడు, జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ యోగా రాజారావు తెలిపారు. కార్యక్రమంలో పార్డ్ ఇండియా సంస్థ దూబచర్ల శాఖ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, చీమకుర్తి ప్రసాద్, కూరపాటి నాగరాజు, సోమిశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

### సహకార కళాశాలల చైర్‌పర్సన్‌గా వసుంధరాదేవి



**నల్లజర్ల:** స్థానికంగా నిర్వహిస్తున్న జూనియర్, డిగ్రీ కళాశాలల చైర్‌పర్సన్‌గా కంఠమణి వసుంధరాదేవి ఎంపికయ్యారు. శనివారం కళాశాలలో జరిగిన పాలకవర్గ సమావేశంలో ఈ నియామకం జరిగింది. బోర్డు సభ్యులలో ఒకరైన గన్నమని దొరయ్యను కరస్పాండెంట్,సెక్రటరీగా ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్‌గా సూర్యదేవర అజయ్‌కుమార్‌ను పాలకవర్గం నియమించింది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఎడ్యుకేషనల్ కో–పరేటివ్ సొసైటీకి సబంధించి డాక్టర్ ఎస్సార్‌కే ,కేఎస్సార్ కోపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కళాశాలలు నడుస్తున్నాయి.

### రామాలయం అభివృద్ధికి రూ.50 వేల విరాళం

**నిడదవోలు:** స్థానిక రాయిపేటలోని కోదండ రామాలయం అభివృద్ధికి ప్రవాస భారతీయుడు (ఎన్‌ఆర్‌ఐ) చల్లపల్లి శ్రీధర్, కృష్ణవేణి దంపతులు రూ.50 వేలు విరాళంగా పంపించారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆ నగదును మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ చేతుల మీదుగా దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, మడిపల్లి భాస్కరం, గొన్నాబత్తుల రామారావు, కామిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### వైద్య ఖర్చులకు రూ.62 వేల ఆర్థిక సాయం

**తాళ్లపూడి:** ఇటీవల విజయనగరంలో సంభవించిన ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నైదెన వెంకటలక్ష్మి అనే మహిళ వైద్యానికి తాళ్లపూడికి చెందిన మానవత సంస్థ జిల్లా సభ్యుడు, జిల్లా రక్త నిధి డైరెక్టర్ జోడాల వెంకటేశ్వరరావు తన మిత్రులతో కలసి రూ.62 వేల ఆర్థిక సాయం అందించారు. ప్రస్తుతం విజయనగరంలోని కాష్వి హాస్పిటల్‌లో క్షతగాత్రురాలు చికిత్స పొందుతోంది. ఆమె వైద్యం, ప్లాస్టిక్ సర్జరీకి రూ.8 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. పరిచయం ఉన్న వారి ద్వారా ఆమె ప్రమాద విషయం వెంకటేశ్వరరావుకు తెలిసింది. దాంతో ఆయన తన స్నేహితులైన గుడివాడ సంధ్య, గుడివాడ గంగాభవాని, వెంకటరాజు సాయంతో రూ.62 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని ఆయన తన భార్య రమాదేవి, స్నేహితుల ద్వారా చికిత్స పొందుతున్న వెంకటలక్ష్మి తల్లి అప్పాయమ్మకు అందజేశారు.

### యువకులకు వాలీబాల్ కిట్ అందజేత



మద్దూరులో యువకులకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న రూరల్ ఎస్సై సుధాకర్

**కొవ్వూరు:** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుపై శ్రద్ధ చూపాలని రూరల్ ఎస్సై కె.సుధాకర్ సూచించారు. మద్దూరు గ్రామంలో శనివారం ఆయన యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు. చదువుతో పాటు ఆటల్లో రాణించి కన్న తల్లిదండ్రులకు పేరు తీసుకు రావాలని సూచించారు. గ్రామంలో అసాంఘిక కార్యక్రమాలకు సంబంధించి ఏవైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

### నేడు చదరంగం పోటీలు

**ప్రకాశం నగర్:** వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా కాల్‌ఫ్యూషన్ చెస్ ఆకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్గత చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆకాడమీ డైరెక్టర్ కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొంటారని, ఆసక్తి కలవారందరూ ఉదయం ఎనిమిది గంటలకు హాజరుకావాలన్నారు.

# కూలీలకు ఉపాధి.. గ్రామాల పురోగతి

- ముమ్మరంగా ఉపాధి హామీ పనులు
- ఆసక్తి చూపుతున్న కూలీలు
- పంట బోదెలు, చెరువుల అభివృద్ధి
- రెండు నెలల్లో 90,847 పని దినాలు

**దేవరపల్లి:** జాతీయ ఉపాధి హామీ పథకం కింద పల్లెల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మూడు నెలలుగా దేవరపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఈ పనులు జోరందుకున్నాయి. పనులు చేయడానికి కూలీలు కూడా ఆసక్తి చూపుతున్నారు. పంట కాలువలు, పంట చెరువుల్లో పూడికతీత, పంట కాలువకు, పంట కాలువకు మధ్య బోదెల ఏర్పాటు వంటి పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. రైతుల పొలాల్లోని బోర్ల వద్ద నీటి కుంటల తవ్వకం పనులను కూడా ఉపాధి హామీ పథకంలో నిర్వహిస్తున్నారు. రోజుకు ఒకొక్క కూలీకి రూ.300 చొప్పున వేతనం చెల్లించవలసి ఉండగా, కూలీలు చేసిన పని, కొలతలను బట్టి రూ.260 చొప్పున చెల్లిస్తున్నారు. వేసవి కావడంతో ఉదయం 6.30 గంటల నుంచి 10.30 గంటల వరకూ ఈ పనులు జరుగుతున్నాయి.

**ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వం**

వేసవిలో కూలీలకు వ్యవసాయ పనులు ఉండవు. ఇలాంటి తరుణంలో ఉపాధి హామీ పథకం వారిని ఆర్థికంగా ఆదుకుంటోంది. రోజుకు నాలుగు గంటలు పనిచేస్తే రూ.260 చొప్పున వేతనం గిట్టుబాటు కావడంతో గ్రామీణ కూలీలు ఈ పనులపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు కూడా ఈ పనులకు హాజరై ఆదాయాన్ని పొందుతున్నారు. ఒక్కొక్క కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు సభ్యులు ఉపాధి జాబ్ కార్డులు పొందారు. జాబ్‌కార్డులు ఉన్నవారందరికీ ప్రభుత్వం ఏడాదికి 200 చొప్పున పని దినాలను కల్పిస్తోంది.

దేవరపల్లి మండలంలో 9,847 జాబ్ కార్డులు ఉండగా, 3,400 మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో కూలీలకు మండలంలో 90,159 పనిదినాలు కల్పించారు. ఏప్రిల్‌లో 39,988 పని దినాలు, మే నెలలో 50,171 పనిదినాలను ప్రభుత్వం కల్పించింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 2.50 లక్షల పనిదినాలు కల్పించడానికి మండల అధికారులు లేబర్ బడ్జెట్ తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ ఆమోదం పొందవలసి ఉంది. కొత్త బడ్జెట్‌లో రెండు నెలల నుంచి పనులు జరుగుతున్నాయి.

**రైతులకు పండ్ల మొక్కల పంపిణీ**

ఐదెకరాలు లోపు పొలం గల చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా మామిడి, ఆయిల్‌పామ్ మొక్కలు పంపిణీ చేస్తున్నారు. అవసరమైన రైతులు ముందుగా ఉపాధి హామీ పథకం అధికారులను సంప్రదించి నమోదు చేసుకొంటున్నారు. రైతులే మొక్కలు కొనుగోలు చేసుకుంటే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందని అధికారులు తెలిపారు.



దేవరపల్లి మండలం ధుమంతునిగూడెంలో చెరువు పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



ధుమంతునిగూడెంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మాధవీలత (ఫైల్)



కృష్ణంపాలెంలో పంట కాలువను అభివృద్ధి చేస్తున్న ఉపాధి కూలీలు

**సకాలంలో వేతనాల చెల్లింపు**



ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు 15 రోజులకు ఒకసారి వేతనాలు చెల్లిస్తున్నాం. కూలీల పోస్టాఫీసు ఖాతా లేదా బ్యాంకు ఖాతాకు వేతనాలను జమ చేస్తున్నాం. రోజుకు ఒకొక్కరికి రూ.260 వేతనం వస్తోంది. పంట కాలువలు, చెరువుల పూడికతీత పనులు ఎక్కువగా జరుగుతున్నాయి. 2024–25 లేబర్ బడ్జెట్ 2.50 లక్షల పనిదినాలు కల్పించవలసి ఉండగా, ఏప్రిల్, మే నెలల్లో 90 లక్షల పనిదినాలు కల్పించాం. మిగిలిన పనులు ప్రభుత్వం నుంచి ఆమోదం రావలసి ఉంది. సన్న, చిన్నకారు రైతులను గుర్తించి ఐదెకరాల లోపు ఉన్న వారందరికీ పండ్ల తోటల పెంపకంలో భాగంగా మొక్కలు పంపిణీకి అంచనాలు తయారు చేసి పంపించాం. ఆగస్టు నెలాఖరు వరకు పనులు జరుగుతాయి.

– జీవీ శ్రీనివాస్, ఏపీఓ, ఉపాధి హామీ పథకం, దేవరపల్లి

# అంజనీ సుతుడా.. భక్త వత్సలుడా..

- డివిజన్ వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో హనుమజ్జయంతి
- పలుచోట్ల లక్ష తమలపాకులు, గంధ సిందూరం పూజలు
- ఆలయాల వద్ద అన్నదానాలు
- కొవ్వూరులో స్వామిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్

**కొవ్వూరు:** హనుమజ్జయంతిని కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కొవ్వూరు మెరక వీధిలోని అభయాంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి రాష్ట్రంలో అధికారంలోకి రావాలని స్వామివారిని కోరుకున్నానన్నారు. ఈనెల 4న వెలువడే సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం అన్నారు. అంతకు ముందు మహిళలు హనుమంతునికి సామూహిక తమలపాకులు, గంధ, సింధూరాలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేశారు. వైఎస్సా ర్ సీపీ పట్టణ మాజీ కన్వీనర్ మైపాల రాంబాబు, గౌరవాధ్యక్షుడు నగ్గులపాటి శ్రీనివాస్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి, చిట్టూరి అన్నవరం, శ్రీరామా సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, తోట రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు అడ్డగర్ల వీరాస్వామి, మురుగొండ శ్రీనివాస్, గంగాధర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే గోష్పాద క్షేత్రంలోని ఆంజనేయస్వామి వారి గుడిలో తమలపాకులతో సహస్ర నామార్చన చేశారు. ఐదు రోజుల పాటు జయంతి వేడుకలు, వివిధ పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

**చాగల్లు:** స్థానిక మెయిన్ రోడ్డులోని ప్రధాన కూడలి వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఎస్.ముప్పవరం గ్రామ ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి దాతలు సహకారంతో అన్నదానం చేశారు. బ్రాహ్మణగూడెం బీసీ కాలనీలోని సాయిబాబా ఆలయం వద్ద హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు.

**తాళ్లపూడి:** వేగేశ్వరపురంలోని అభయాంజనేయ స్వామి వారికి అర్చకుడు పెరవలి సాయి ఆధ్వర్యంలో సిందూరం, తమలపాకులతో పూజలు చేశారు. మలకపల్లి గ్రామంలోని కొత్తపేట వద్ద గల ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు భారీఎత్తున అన్నసమారాధన చేశారు. అలాగే తాళ్లపూడి, ప్రక్కిలంక, అన్నదేవరపేట తదితర గ్రామాల్లో హనుమజ్జయంతిని భక్తులు ఘనంగా నిర్వహించారు.



కొవ్వూరులో భారీ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్, నాయకులు



చాగల్లు మండలం ఎస్.ముప్పవరం గ్రామంలోని ఆంజనేయస్వామి

**పెరవల్లిలో లక్ష తమలపాకుల పూజ**

**పెరవలి:** స్థానిక అభయాంజనేయస్వామి వారికి రావులపాలేనికి చెందిన ఆకుల వెంకటేశ్వరరావు దంపతులచే లక్ష తమలపాకులు, గంధ సిందూర పూజ నిర్వహించారు. ఇక్కడి 35 అడుగుల ఎత్తైన అభయాంజనేయస్వామి విగ్రహానికి అభిషేకాలు జరిగాయి. సాయంత్రం ఏర్పాటు చేసిన చిన్నారుల కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అలాగే ఖండవల్లిలోని భక్తాంజనేయస్వామి వారి అలంకరణ భక్తులను అలరించింది. ఇక్కడ స్వామి వారికి నిర్వహించిన హోమంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు. జనసేన నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు కూడా పూజల్లో పాల్గొన్నారు. మండలంలోని కానూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, అన్నవరప్పాడు, కడింపాడు, మల్లేశ్వరం, ముక్కామల గ్రామాల్లో హనుమజ్జయంతి ఉత్సవాలు జరిపించారు. ఆలయాల వద్ద భజనలు, ఏకాహం నిర్వహించారు.



ఉండ్రాజవరం మండలం వెలగదుర్రులో విశేష అలంకరణలో భక్తాంజనేయ స్వామి

**ఉండ్రాజవరం:** మండలంలోని పాలంగి భక్తాంజనేయ స్వామివారికి తెల్లవారుజామున గంధ సిందూరం, తమలపాకులతో అభిషేకించారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు. ఉండ్రాజవరంలోని శ్రీపంచముఖి ఆంజనేయ స్వామి, మోర్తలోని దక్షిణముఖ ఆంజనేయ స్వామి, వెలగదుర్రులోని క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు, అభిషేకాలు, అన్న సమారాధనలు నిర్వహించారు. వేలివెన్ను, తాడిపర్రు, చివటం, వడ్లూరు తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలతో పాటు హనుమాన్ చాలీసా పఠించారు.

**నిడదవోలు రూరల్:** తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయంలోని పంచముఖ ఆంజనేయస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ధర్మకర్తలమండలి సభ్యులు పాల్గొన్నారు. కలవచర్ల గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో బోనేపల్లి సుబ్బారావు, ఉమాదేవి దంపతుల ఆధ్వర్యంలో లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపించారు. మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, నిచ్చెనకోళ్ల సాయిబాబా తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. మునిపల్లిలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలోని అభయాంజనేయస్వామికి అభిషేకాలు జరిపించారు. సమిశ్రగూడెం, జీడిగుంట, తాడిమళ్ల గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



నిడదవోలు మండలం కలవచర్ల అభయాంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ



నిడదవోలు మండలం మునిపల్లిలో అభయాంజనేయస్వామి



తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం ఆంజనేయ స్వామి గుడిలో పూజలు



పెరవలిలో అభయాంజనేయస్వామి వారికి లక్ష తమలపాకుల పూజ


### చికిత్స పొందుతూ యువకుడి మృతి



గెల్లా దిలీప్ (16)

**నిడదవోలు రూరల్:** మండలంలోని సమిశ్రగూడెంలో బైక్‌పై నుంచి పడి ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన గెల్లా దిలీప్ (16) చికిత్స పొందుతూ మరణించినట్టు ఎస్సై రమేష్ శనివారం తెలిపారు. వాడపల్లికి చెందిన గెల్లా గంగరాజు, మంగా దంపతులకు ముగ్గురు కుమారులు. రెండో వాడైన దిలీప్ ఈ ఏడాది టెన్త్ పాసయ్యాడు. మరో ఇద్దరు స్నేహితులతో కలిసి శుక్రవారం బైక్‌పై సింగవరం వెళ్లాడు. అదే రోజున తిరుగు ప్రయాణంలో ముగ్గురు యువకులు సమిశ్రగూడెం శివారులో బైక్‌పై నుంచి అదుపు తప్పి పడిపోతూ అదే సమయంలో తాడేపల్లిగూడెం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. తీవ్రగాయాలైన దిలీప్ కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందగా, మరో ఇద్దరైన ప్రవీణ్, నిరీక్షణ్‌లకు తీవ్రగాయాలై ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సమిశ్రగూడెం పోలీసులు పేర్కొన్నారు.

# ఎండా వానా.. అంతుచిక్కేనా..



గోదావరిపై శనివారం సాయంత్రం కమ్ముకున్న మబ్బులు



ఎండ కారణంగా నగరంలో శుక్రవారం నిర్మానుష్యంగా మారిన రోడ్డు

- విచిత్రంగా వాతావరణం
- నిప్పులు చెరుగుతున్న భానుడు
- సేదతీరుస్తున్న వరుణుడు

**సీటీఆర్ఐ:** ఈ ఏడాది వేసవి కాలం చాలా విచిత్రంగా కొనసాగుతోంది. ఒకసారి మండే ఎండలతో భానుడు చెలరేగిపోగా, కొన్ని రోజులు వరుణుడు వానలతో సేదతీరుస్తున్నాడు. ఏప్రిల్ నుంచి ఎండలు ముదిరిపోయాయి. ఉక్కబోతను తట్టుకోలేక ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఎండలకు భయపడి మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బయటకు రావడం మానేశారు. ఎండ నుంచి ఉపశమనం కోసం వైద్యుల సలహాలు పాటించారు. అయితే ఆ నెల మధ్యలోనే వరుణుడు పలకరించాడు. దాదాపు వారం రోజులు పాటు వర్షం కురిపించాడు. చల్లని గాలులతో సేదతీర్చాడు.

**కొనసాగిన ఎండలు**

మే నెలలో మళ్లీ సూర్యుడు విజృంభించాడు. ఎండలకు తోడు ఎన్నికల వేడి కొనసాగింది. మధ్యలో అడపాదడపా వర్షం కూడా కురిసింది. ఇక రోహిణీ కార్తెలో భానుడు తన విశ్వరూపం చూపించాడు. భూమిపై నిప్పులు కురిపించాడు. విపరీతమైన ఎండలతో ప్రజలు అల్లాడిపోయారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు చాలా అవస్థలు పడ్డారు. ఉదయం సుమారు పది గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకూ వేడి గాలులు వీచాయి. గత వారం రోజులుగా ఎండలు విపరీతంగా కాశాయి. ప్రతి రోజూ సుమారు 40 డిగ్రీలు నమోదయ్యాయి.

**ప్రజల బెంబేలు**

ఎండ తీవ్రతను తట్టుకోలేక ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఇళ్లలో ఏసీలు, ఫ్యాన్‌లు, కూలర్లు నిరంతరంగా పనిచేశాయి. శుక్రవారం అయితే దాదాపు 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పగలంతా ఇళ్లల్లో ఉన్న ప్రజలు సాయంత్రం ఆరు గంటలు దాటాక పార్కులు, గోదావరి గట్టును ఆశ్రయించారు. పళ్ల రసాలు, కూల్ డ్రింక్ షాపులు, పుచ్చకాయల దుకాణాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. ఎండ నుంచి రక్షణ పొందటానికి ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయించారు. గోదావరి తీరంలో ఘాట్లు సాయంత్రం సందర్శకులతో కిటకిటలాడాయి. ఎండ నుంచి సేదతీరేందుకు అందరూ కుటుంబాలతో కలిసి ఘాట్లకు పోటెత్తారు.

**మబ్బులతో ఆహ్లాదం**

రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించాయని, త్వరలో వానలు పడతాయని వాతావరణశాఖ చేసిన ప్రకటనతో ప్రజలకు ప్రాణం లేచి వచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం వాతావరణంగా చల్లగా ఉంది. మబ్బులతో నిండిన ఆకాశం ఆహ్లాదం కలిగించింది. శుక్రవారం వరకూ నిప్పులు చెరిగిన భానుడు మబ్బుల చాటుకు వెళ్లిపోయాడు. చల్లని వాతావరణం కొనసాగుతుందా, లేకపోతే మళ్లీ భానుడు విజృంభిస్తాడా అనే సందేహం ప్రజలలో నెలకొంది.

### ఉపాధి కూలీలకు దుస్తుల పంపిణీ

**ఉండ్రాజవరం:** మండలంలోని తాడిపర్రుకు చెందిన కత్తుల శరణ్య, నేహిత అనే చిన్నారులు తమ పుట్టినరోజు వేడుకను శనివారం ఆ గ్రామంలోని ఉపాధి హామీ కూలీల సమక్షంలో జరుపుకున్నారు. గ్రామంలోని పొలాల్లో పని చేస్తున్న ఉపాధి కూలీల సమక్షంలో చిన్నారులిద్దరూ పుట్టిన రోజు కేక్ కట్ చేశారు. కేక్‌తో పాటు స్వీట్లను పలువురు ఉపాధి కూలీలకు దుస్తులు, మజ్జిగ పంపిణీ చేశారు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ రవిబాబు పాల్గొన్నారు.

# పొలాల వైపు గోదారి జలాల పరుగులు


విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ స్విచ్ ఆన్ చేసి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు నీటిని విడుదల చేస్తున్న జలవనరుల శాఖ శెట్టిపేట ఈఈ దక్షిణామూర్తి

- పశ్చిమ డెల్టా కాలువలకు నీటి విడుదల
- తొలిరోజు 500 క్యూసెక్కులు
- దశల వారీగా పెంపు
- హెడ్ స్లూయిజ్ వద్ద గోదావరి మాతకు పూజలు

**నిడదవోలు:** పాలికులు ఆనంద పడేలా కాలువల మీదుగా గోదావరి జలాలు పొలాల బాట పట్టాయి. నీటిపారుదల శాఖ అధికారులు శనివారం పశ్చిమ డెల్టా కాలువలకు గోదావరి నది నుంచి నీటిని విడుదల చేశారు. కాలువల మూసివేతతో నీళ్లు లేక వేసవి తాపానికి అల్లాడిన పశువులకు తాజాగా జలాల విడుదలతో ఊరట లభించింది. తొలకరి పలకరింపు, గోదావరి జలాల రాకతో ఏరువాకకు అన్నదాతలు సమాయత్తం అవుతున్నారు. విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు వేద పండితులు నిర్ణయించిన ముహూర్తమైన శనివారం ఉదయం 10.56 గంటలకు జలవనరుల శాఖ శెట్టిపేట ఈఈ ఎం.దక్షిణామూర్తి స్విచాన్ చేసి స్లూయిజ్ గేట్లను ఎత్తారు. మొదటి గేటు నుంచి 100 క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేశారు. తర్వాత మిగిలిన గేట్లను కూడా ఎత్తి నీటి విడుదలను దశల వారీగా 500 క్యూసెక్కులకు పెంచారు. పశ్చిమ డెల్టా ప్రధాన కాలువతో పాటు, ఉప కాలువలకు నీటి విడుదల చేశారు. వారం రోజుల్లో పూర్తి స్థాయిలో కాలువలకు నీటిని విడుదల చేస్తారని అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా హెడ్ స్లూయిజ్‌ను మామిడి తోరణాలు, అరటి గెలలతో అలంకరించారు. శెట్టిపేట ఈఈ ఎం.దక్షిణామూర్తి హెడ్ స్లూయిజ్ వద్ద గోదావరి మాతకు పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య గోదావరి మాతకు నూతన వస్త్రాలు, పసుపు కుంకుమ సమర్పించారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి వీఎస్ కిరణ్‌కుమార్, లాక్ సూపరింటెండెంట్ జీజే విక్రమ్, ఫిషర్‌మన్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.గోవిందరాజు, కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**5.30 లక్షల ఎకరాలకు నీరు**

ఈ ఏడాది ఖరీఫ్‌లో పశ్చిమ డెల్టా పరిధిలోని 5.30 లక్షల ఎకరాలకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేస్తామని జలవనరుల శాఖ శెట్టిపేట ఈఈ ఎం. దక్షిణామూర్తి చెప్పారు. ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి జలాలను సద్వినియోగం చేసుకుని రైతులు నారుమడుల పనులను ప్రారంభించాలని సూచించారు. ప్రస్తుతం గోదావరి నదిలో మూడు టీఎంసీల నీరు అందుబాటులో ఉందన్నారు. వర్షాలు కురిసిన తర్వాత నదిలోకి ఇన్ ఫ్లో పెరుగుతుందని చెప్పారు. మొదటి విడతగా పశ్చిమ డెల్టా కాలువలకు 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో కాలువలు శుభ్రపడతాయన్నారు. దశల వారీగా నీటి విడుదలను పెంచుతామని దక్షిణామూర్తి చెప్పారు. సకాలంలో రైతులకు సాగు నీటిని అందిస్తున్నామని పేర్కొన్నారు.

# సింగవరంలో ముత్యాలమ్మ జాతర


సింగవరం గ్రామదేవత ముత్యాలమ్మ వారు


దేవరపల్లిలో విదమ్మ తల్లి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

**నిడదవోలు రూరల్:** మండలంలోని సింగవరం గ్రామ దేవత ముత్యాలమ్మ వారి జాతర మహోత్సవాలు మూడో రోజైన శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామవీధుల్లో అమ్మవారి సేవ జరిపించారు. విచిత్ర వేషధారణలు, బుట్టబొమ్మలు, విద్యుత్తు దీపాలంకరణలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. శనివారం రాత్రి బలిచేట ఊరేగింపు జరిగింది. అమ్మవారికి గ్రామస్తులు ఆదివారం నైవేద్యాలు సమర్పిస్తారు. జాతరకు పుట్టింటికి వచ్చిన ఆడ పడుచులు, బంధువులతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

**పురవీధుల్లో ఊరేగిన విదమ్మ తల్లి**

**దేవరపల్లి:** రజకుల కులదైవమైన విదమ్మ తల్లి మహోత్సవాలు దేవరపల్లిలో నాలుగు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారికి రోజూ పూజలు, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని గ్రామ వీధుల్లో శనివారం కోలాహలంగా ఊరేగించారు. రజక సంఘం ఆధ్వర్యంలో గరగ నృత్య ప్రదర్శనలు, బ్యాండ్ మేళాలతో ఊరేగింపు సాగింది. ఆదివారంతో ఉత్సవాలు ముగుస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

## వెంకన్న సేవ..తనివి తీరంగ


అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

**పెరవలి:** శనివారం కావడంతో అన్నవరప్పాడులోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నాలుగు గంటలకు స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించాక, భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం ఏడింటికి ప్రారంభమైన భక్తుల తాకిడి మధ్యాహ్నం 1 గంట వరకూ కొనసాగింది. దూర ప్రాంత భక్తులకు ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. దర్శనం చేసుకున్న భక్తులకు పులిహోర పంపిణీ చేస్తున్నామని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ చెప్పారు. దాతల సహకారంతో ఈ శనివారం నుంచి దేవస్థానం అన్నదానాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. భక్తుల నుంచి అన్నదానానికి విరాళాలు సేకరిస్తున్నామన్నారు.

## 10 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

**గోపాలపురం:** మండలంలోని వెంకటాయపాలెంలో శనివారం ఒక వ్యక్తిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు దేవరపల్లి ఎస్ఈబీ సీఐ కేవీ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. ఈ దాడిలో ఎస్సై పి సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

## 28 ద్విచక్ర వాహనాల స్వాధీనం


దూబచర్లలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న నల్లజర్ల పోలీసులు

**నల్లజర్ల:** స్థానిక సీఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం మండలంలోని దూబచర్ల గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేని 28 ద్విచక్ర వాహనాలను ఈ సందర్భంగా వారు స్వాధీనం చేసుకున్నారు. అంతకు ముందు గ్రామస్తులతో పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతున్నందున గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కూడా సహకరించాలన్నారు. ఎన్నికల నిబంధనలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియపై గ్రామంలోని రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నల్లజర్ల ఎస్ఐ వెంకట సురేష్, సచివాలయ సంరక్షణాధికారి బేబీ సరోజని పాల్గొన్నారు.

## కృష్ణబాబు కుటుంబానికి పలువురి పరామర్శ

**కొవ్వూరు:** ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు, కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు కుటుంబ సభ్యులను శనివారం పలువురు ప్రముఖులు పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.దొమ్మేరులోని స్వగృహానికి వెళ్లి కృష్ణబాబు చిత్ర పటానికి పూలు వేసి నివాళి అర్పించారు. ఆయన అల్లుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, సోదరుడు, ఆంధ్రా షుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు, ఇతర కుటుంబ సభ్యులను నాయకులు పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు పెందుర్తి వెంకటేష్, గద్దే రామ్మోహన్‌రావు, ముప్పిడి వెంకటేశ్వరరావు, చిట్టూరి రవీంద్ర, జనసేన నాయకులు భోగవల్లి ప్రసాద్‌లతో పాటు గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు రాజీవ్‌కృష్ణ, అచ్చిబాబు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. దొమ్మేరులోని కృష్ణబాబు స్వగృహం వద్ద ఆదివారం పెద్ద కార్యం నిర్వహించనున్నారు. ఈమేరకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు.